సాక్షి జనగామ

శనివారం । 1 । ఏప్రిల్ । 2023



ప్రయాణికులపై 'టోల్' పిడుగు

రాష్ట్ర వ్యాప్తంగా టోల్ ప్లాజాల వద్ద నేటి(శనివారం) నుంచి కొత్త రేట్లు అమలులోకి రానున్నాయి. - 8లో▸



కేఎంసీకి మరో ఖ్యాతి

వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాల సూపర్ స్పెషాలిటీ పీజీ సీట్లు సాధించి మరో ఖ్యాతిని చాటుకుంది. - 8లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం $36^0/23^0$

జిల్లాలో ఉదయం చల్లని వాతావరణం ఉటుంది. ఆకాశం అధిక శాతం మేఘావృతం అవుతుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు కాస్త తగ్గుతాయి.

ఇఫ్తార్	సహర్
శని 6:35	ఆది 4:48

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

బార్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నిక



కూరెళ్ల శ్రీనివాస్‌రెడ్డి
అధ్యక్షుడు



తాళ్లపెల్లి రాజయ్య
ప్రధాన కార్యదర్శి

జనగామ రూరల్: జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికలు శుక్రవారం జరిగాయి. ఎన్నికల అధికారులుగా ఎనగందుల భిక్షపతి, జి.నరేష్‌బాబు, వంచ పద్మారెడ్డి నేతృత్వంలో నిర్వహించిన పోలింగ్‌లో 131 ఓటర్లకు 129 పోల్ అయ్యాయి. అధ్యక్షుడిగా పోటీ చేసిన కూరెళ్ల శ్రీనివాస్ రెడ్డికి 68, వై.చంద్రరుషికి 61 ఓట్లు వచ్చాయి. 7 ఓట్ల మెజార్టీతో శ్రీనివాస్‌రెడ్డి గెలుపొందారు. ప్రధాన కార్యదర్శిగా పోటీ చేసిన తాళ్లపల్లి రాజయ్య 36 ఓట్లుతో విజయం సాధించారు. ఉపాధ్యక్షుడిగా రాపోతుల ఉప్పలయ్య, సహాయ కార్యదర్శిగా జమాల్ షరీఫ్, కోశాధికారిగా జి.దివ్య, మహిళా కార్యదర్శిగా బిర్రు స్వప్న, సభ్యులుగా గువ్వ జైహింద్, పెండ్లి అశోక్‌రెడ్డి, మోకు రాజిరెడ్డి, ఉదయ్, ఇట్టబోయిన జ్యోత్స్న ఎన్నికైనారు.నట్లు భిక్షపతి తెలిపారు.

పేదల గురించి ఆలోచించాలి



జనగామ రూరల్: పట్టణంలోని ఇందిరమ్మ మూడో విడత లబ్ధిదారులు 53 రోజులుగా దీక్షలు చేస్తున్నా ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి పట్టించుకోవడంలేదని, పేదల గురించి ఆలోచించాలని సాధన కమిటీ సభ్యుడు ఎండీ.అలీ అన్నారు. శుక్రవారం దీక్షను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ.. 2012–13లో పట్టాలు ఇచ్చి స్థలాలు చూపలేదని, ఆరు నెలల్లో డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని చెప్పినా నేటికీ పనులు పూర్తి కాలేదన్నారు. వెంటనే పనులు పూర్తి చేసి అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎండీ.గౌసియా, రాజు, మల్లమ్మ, లక్ష్మి, మాదమ్మ, రేణుక, యాదగిరి, వెంకటయ్య, లచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల్లో వసతుల కల్పనకు చర్యలు



దేవరుప్పుల: జిల్లా వ్యాప్తంగా మూడో తేదీ నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అవసరమైన వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు డీఈఓ రాము తెలిపారు. మండల కేంద్రంతోపాటు కామారెడ్డిగూడెం హైస్కూల్ సెంటర్లను ఆయన శుక్రవారం సందర్శించారు. ఆయా పాఠశాలల హెచ్ఎంలతో హాల్‌టికెట్ల జారీ, తరగతి గదులు, విద్యుత్, తాగునీరు వసతుల కల్పనపై సూచనలు చేశారు. మండల నోడల్ అధికారి ఉపేందర్, హెచ్ఎం శ్రీలత ఉన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి



బచ్చన్నపేట: గ్రామాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని డీఎల్‌పీఓ పార్థసారధి అన్నారు. శుక్రవారం ఆలింపూర్ జీపీని సందర్శించిన ఆయన రికార్డులను పరిశీలించారు. అలాగే పల్లె ప్రగతి పనులు, వీధులు, తాగునీటి సరఫరా, వీధిదీపాల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రతపై స్వయంగా ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామస్తుల కనీస అవసరాలు తప్పకుండా తీర్చాలని, జీపీలో జమ, ఖర్చులు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని చెప్పారు. పన్నులు నూరు శాతం వసూలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి రేవతి, కారోబార్ మురళి, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.



కౌన్సిల్ సమావేశానికి హాజరైన అధికార, ప్రతిపక్ష సభ్యులు



వాకౌట్ చేసి మున్సిపల్ ఎదుట నినాదాలు చేస్తున్న బీజేపీ, కాంగ్రెస్ సభ్యులు

పట్టణాభివృద్ధి పట్టదా..?

- ఎజెండాలో ప్రజాసమస్యలేవీ..?
- లావాదేవీల కోసమేనా సమావేశాలు!
- జనరల్ ఫండ్ నుంచి నిధులు ఇతరాలకు మళ్లింపులెందుకు..
- నిలదీసిన బీజేపీ, కాంగ్రెస్ కౌన్సిలర్లు
- పలువురు బీఆర్ఎస్ సభ్యులతో కలిసి మున్సిపల్ కౌన్సిల్ నుంచి వాకౌట్
- రసాభాసగా సాధారణ సమావేశం

జనగామ: 'పట్టణ అభివృద్ధి ఎక్కడా?.. ప్రజాసమస్యలు పట్టించుకోరా.. లావాదేవీల కోసమే కౌన్సిల్ నిర్వహిస్తారా.. ఇదేమి పద్ధతి' అంటూ అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు ఎజెండాలోని అంశాలను తిరస్కరిస్తూ.. సమావేశం నుంచి వాకౌట్ చేశారు. జనగామ పురపాలిక కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పి.జమునలింగయ్య అధ్యక్షతన జరిగిన సాధారణ సమావేశం రసాభాసగా మారింది. ఎజెండా అంశాలను ప్రారంభిస్తుండగా.. బీజేపీ, కాంగ్రెస్ కౌన్సిలర్లు మహంకాళి హరిశ్చంద్ర గుప్త, గాదెపాక రాంచందర్, ఉడుగుల శ్రీలత, బొట్ల శ్రీనివాస్, వంగాల కల్యాణి పోడియం వద్దకు వచ్చి కమిషనర్, చైర్‌పర్సన్‌ను నిలదీశారు. వార్డుల్లో కనీస మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయించకుండా.. ఇష్టానుసారంగా ఎజెండా తయారు చేయడం ఏమిటని వాగ్వాదానికి దిగారు. జనరల్ ఫండ్ నుంచి ఇతర వాటికి లక్షల రూపాయల కేటాయింపులు ఎవరి ఆమోదంతో ఎజెండాకు తీసుకొచ్చారని ప్రశ్నించారు. దీనిపై అధికారుల నుంచి సమాధానం రాకపోవడంతో సమావేశానికి వచ్చినట్లు సంతకాలు చేసిన కాంగ్రెస్, బీజేపీ, పలువురు బీఆర్ఎస్ సభ్యులు.. 31 ఎజెండా అంశాలు ఆమోదించకుండానే వాకౌట్ చేశారు.



పోడియం వద్ద అధికారులను నిలదీస్తున్న సభ్యులు

కౌన్సిలర్లు ఏమన్నారంటే..

మున్సిపల్ సమావేశం నుంచి వాకౌట్ చేసిన తర్వాత అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు విలేకరులతో మాట్లాడారు.

- ప్రజాధనాన్ని ఎలా దోచుకోవాలా అనే ఆలోచనతో ఎజెండా రూపొందించినట్లు ఉందని, 31 ఎజెండా అంశాల్లో వార్డుల అభివృద్ధి ఊసే ఎత్తక పోవడం సిగ్గుచేటని కాంగ్రెస్ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ గాదెపాక రాంచందర్ అన్నారు. ప్రజా సమస్యలపై ప్రతిపక్ష సభ్యులకు మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నించారు.
- బీజేపీ కౌన్సిలర్ మహంకాళి హరిశ్చంద్రగుప్త మాట్లాడుతూ.. జనరల్ ఫండ్ నిధుల నుంచి ఇతర వాటికి ఎలా కేటాయిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యయుతంగా గెలిచి కౌన్సిల్‌లో అడుగుపెట్టి మూడేళ్లు దాటినా వార్డులను అనుకున్న మేర అభివృద్ధి చేసుకోలేక పోతున్నామని అన్నారు. శిథిలావస్థలో ఉన్న ఫ్లై ఓవర్‌కు లక్షల రూపాయాలు ఖర్చు చేయడం అవసరా అని మండిపడ్డారు.
- కాంగ్రెస్ కౌన్సిలర్ జక్కుల అనిత మాట్లాడుతూ తన వార్డులో అభివృద్ధి పనులకు ఒక్క రూపాయి కూడా కేటయించడం లేదని చెప్పారు. కేవలం లావాదేవీల కోసమే నెలనెలా సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. అరగంట కూడా ప్రజా సమస్యలపై మాట్లాడనివ్వడం లేదని ధ్వజమెత్తారు. మూకుమ్మడిగా ఎజెండాలను ఆమోదించకుండానే సభను బహిష్కరించినట్లు ఆమె పేర్కొన్నారు.
- 9వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ చందర్ మాట్లాడుతూ 6వ ఎజెండా అంశంలో నెహ్రూపార్కు జంక్షన్ అభివృద్ధికి సాధారణ పద్దు నుంచి రూ.35 లక్షలు ఎలా కేటాయించారని ప్రశ్నించారు. ఒకే ఎజెండాలో పైన సాధారణ పద్దు.. రెండో లైన్‌లో పట్టణ ప్రగతి నిధులు అని పేర్కొనడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు.
- అధికార పార్టీ కౌన్సిలర్లు బండ పద్మ, పేర్ని స్వరూప, పాక రమ, జూకంటి లక్ష్మి, వాంకుడోతు అనిత తదితరులు మాట్లాడుతూ.. సమావేశానికి హాజరైనట్లుగా సంతకాలు చేసిన అనంతరం.. వార్డుల అభివృద్ధికి ఎజెండాలో ఎటువంటి కేటాయింపులు లేకపోవడంతో వాటికి ఆమోదించలేదని చెప్పారు. అంబేడ్కర్ జయంతి, రంజాన్ వేడుకల నిర్వహణకు నిధులు కేటాయించాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

సమాజ హితానికి పాటుపడాలి

- రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

దేవరుప్పుల: యువత సమాజ హితం కోసం పాటుపడితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. పెద్దమడూరులో ఏర్పాటు చేసిన సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ, శ్రీ కంఠమహేశ్వరస్వామి ఆలయ పునరుద్ధరణ అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి రావాలని యువనాయకుడు బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్ మంత్రిని ఆహ్వానించారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని క్వార్టర్స్‌లో దయాకర్‌రావును కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..ఆర్థికంగా ఎదిగినవారు తమ పరిసరాల అభివృద్ధికి పాటుపడినప్పుడే గుర్తింపు లభిస్తుందని, శ్రీకాంత్‌గౌడ్ భాగస్వామ్యం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఆకవరం పెద్దారెడ్డి, ఎంపీటీసీ పానుగంటి గిరి, కారుపోతుల శ్రీనివాస్, ఉపసర్పంచ్ వెంకటేష్, నల్ల ఉమేష్, బండారి రాములు, వంగ అర్జున్, పెద్దగోని సిద్దయ్య, అశోక్, బబ్బూరి రవి తదితరులు పాల్గొన్నారు.



మంత్రికి పుష్పగుచ్ఛం ఇస్తున్న బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్

వైద్యసిబ్బంది బాధ్యతగా పనిచేయాలి



ఘన్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద కలెక్టర్ శివలింగయ్య తదితరులు

- కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాల్లో వైద్యులు, సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య అన్నారు. ఛాగల్లు రైతువేదికలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఆయన శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. విధినిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరుకుని ఆస్పత్రి పరిసరాలను పరిశీలించి సిబ్బంది వివరాలు, ల్యాబ్‌టెస్టులు, ఇన్‌పేషెంట్, అవుట్‌పేషెంట్, మందుల పంపిణీ గురించి తెలుసుకున్నారు. ప్రతి మంగళవారం అన్ని పీహెచ్‌సీల్లో నిర్వహించే ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆస్పత్రికి వచ్చే ప్రజలకు సకాలంలో వైద్యం అందించి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ డాక్టర్ రవీందర్, డిప్యూటీ డీఎంహెచ్ ఓ డాక్టర్ సుధీర్, తహసీల్దార్ పూల్‌సింగ్‌చౌహాన్, వైద్యులు సంధ్యారాణి, భాస్కర్, రాజశేఖర్ ఉన్నారు.

ఉద్యోగ విరమణ తప్పనిసరి

జనగామ రూరల్: ఉద్యోగులకు విరమణ తప్పనిసరి అని కలెక్టర్ శివలింగయ్య అన్నారు. కలెక్టర్ కార్యాలయం వాచ్‌మన్ దాసరి మల్లేషం ఉద్యోగ విరమణ సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మల్లేషం దంపతులను సన్మానించారు. కలెక్టరేట్ పరిపాలనాధికారి మన్సూరి, యుగంధర్, గంగాభవాని, కిష్టయ్య, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీ ల్యాబ్‌కు ఎన్‌ఏబీఎల్ సర్టిఫికెట్

- అభినందించిన కలెక్టర్ శివలింగయ్య
- నెలరోజుల్లో కేంద్ర బృందం రాక

జనగామ: జిల్లా కేంద్రంలోని తెలంగాణ డయాగ్నోస్టిక్ ల్యాబొరేటరీకి నేషనల్ అక్రిడిటేషన్ బోర్డు ఫర్ టెస్టింగ్ కాలిబ్రేషన్ ల్యాబొరేటరీస్(ఎన్‌ఏబీఎల్) ఎంట్రీ లెవల్ సర్టిఫికెట్ వచ్చింది. రాష్ట్రంలో 19 టీడీ ల్యాబ్‌లు ఉండగా.. జనగామకు మాత్రమే ఈ సర్టిఫికెట్ దక్కింది. దేశ వ్యాప్తంగా ల్యాబొరేటరీల పనితీరును ఎన్‌ఏబీఎల్ పర్యవేక్షించి నాణ్యతతో కూడిన పరీక్షలు చేసే ల్యాబ్‌లకు క్వాలిటీ సర్టిఫికెట్లు అందజేస్తుంది. ఇందులో భాగంగా సేకరించిన క్యాన్సర్, వివిధ రకాల రక్త నమూనాలను దేశంలోని ప్రముఖ చెన్నై రాష్ట్రం వెల్లూరు సీఎంసీ, అలాగే లక్నో, రాండాక్స్, ఢిల్లీలోని ఏయిమ్స్ తదితర మెడికల్ కళాశాలల్లో టెస్టులు నిర్వహించిన తర్వాత.. రాష్ట్రాల్లో ప్రభుత్వ పరంగా కొనసాగుతున్న డయాగ్నోస్టిక్స్ ల్యాబొరేటరీలకు పంపించి రిపోర్టులను క్రాస్ చెక్ చేసుకుంటారు. జనగామ డయాగ్నోస్టిక్ సెంటర్ నుంచి వెళ్లిన రిపోర్టులు నాణ్యతా ప్రమాణాలతో కూడినవని నిర్ధారణ కావడంతో ఎన్‌ఏబీఎల్ నుంచి ఎంట్రీ లెవల్ సర్టిఫికెట్‌కు అర్హత సాధించింది. ఈ సర్టిఫికెట్ 2023 మార్చి 29వ తేదీ నుంచి 2026 మార్చి 28వ తేదీ వరకు చెల్లుబాటు అవుతుందని అందులో పేర్కొన్నారు. పూర్తి స్థాయి క్వాలిటీ సర్టిఫికెట్ కోసం ఎన్‌ఏబీఎల్ బృందం మరో నెల రోజుల్లో జిల్లాకు రానుంది. అప్పటి వరకు రక్త పరీక్షలకు సంబంధించి డాక్యుమెంటేషన్ పూర్తి చేసి వారికి అప్పగించాల్సి ఉంటుంది.

2లక్షల పరీక్షలు

జిల్లా కేంద్రం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఎదురుగా 2021 జూన్‌లో తెలంగాణ డయాగ్నోస్టిక్ ల్యాబొరేటరీని ఏర్పాటు చేశారు. జిల్లాలోని పీహెచ్‌సీ, డిస్ట్రిక్ట్ ఆస్పత్రి, సీహెచ్‌సీల నుంచి రోజు వారీగా సేకరించిన రక్త నమూనాలను ఇక్కడికి తీసుకొచ్చి పరీక్షలు నిర్వహించి రిపోర్టుల సమాచారాన్ని ఆన్‌లైన్‌లో సంబంధిత ఆస్పత్రులతో పాటు పేషెంట్ల ఫోన్‌కు పంపిస్తారు. ఇప్పటి వరకు 88,406 మంది వద్ద 1,41,523 రక్త నమూనాలు సేకరించగా, 2,74,612 రకాల పరీక్షలు నిర్వహించారు. ఇందులో థైరాయిడ్, టీబీ(ఇఖ్జ), బీ–3, బీ–12, షుగర్, కిడ్నీ, లంగ్స్ తదిర ఖరీదైన, సాధారణ పరీక్షలు చేశారు.



సుగుణాకర్‌రాజుకు సర్టిఫికెట్ అందజేస్తున్న కలెక్టర్

సంతోషంగా ఉంది : కలెక్టర్

రక్త పరీక్షల క్వాలిటీ ఎంట్రీ లెవల్‌లో జనగామ తెలంగాణ డయాగ్నోస్టిక్ ల్యాబ్‌కు రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచి జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం సంతోషంగా ఉందని కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య అన్నారు. డయగ్నోస్టిక్ మేనేజర్ శ్రీనివాస్, జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్‌రాజు శుక్రవారం కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అందరి కృషి ఫలితంగానే ఈ గుర్తింపు సాధ్యమైందని, ఇదే స్ఫూర్తితో పూర్తి స్థాయి సర్టిఫికెట్ వచ్చేలా పనిచేసి ఆదర్శంగా నిలవాలని కోరారు.

వేతన వెతలు

- జీపీ కార్మికులకు మూణ్నెళ్లుగా అందని జీతాలు
- ట్రెజరీల్లోనే నెలల తరబడి చెక్కులు
- ఇళ్లు గడవడానికి తప్పని అప్పులు
- జిల్లాలో 281 గ్రామ పంచాయతీలు
- మల్టీపర్పస్ కార్మికులు 1,080 మంది

జనగామ రూరల్: గ్రామలను పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజలకు ఆరోగ్యకర వాతావరణం అందిస్తున్న మల్టీపర్పస్(గ్రామ పంచాయతీ) కార్మికులు అరకొర వేతనం.. అదీ సమయానికి రాక కుటుంబాలు గడవక దుర్భర జీవనం గడుపుతున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి వేతనాలు రాక అవస్థలు పడుతుండగా.. కొన్ని గ్రామాల్లో సర్పంచ్‌లు సర్దుబాటు చేస్తున్నారు. 15వ ఆర్థిక సంఘం నుంచి జీతాలు చెల్లించాల్సి ఉండగా తప్పనిసరి పరిస్థితుల్లో జనరల్ ఫండ్ నుంచే ఇస్తున్నారు. వేతనాల చెక్కులు కూడా నెలల తరబడి ట్రెజరీల్లో మూలుగుతున్నాయి. దీంతో నెలంతా పనిచేసినా చేతికి వేతనం రాక ఇల్లు గడవడానికి అప్పులు చేయాల్సి వస్తోంది.

విధుల్లో 1080 మంది..

జిల్లాలో 281 గ్రామ పంచాయతీలు ఉండగా 1,080 మంది జీపీ కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. కార్మికులు అవసరానికంటే 25 శాతం తక్కువగా ఉండడంతో పనిభారం పడుతున్నా.. నెలకు రూ.8,500 జీతమే అయినా.. అదికూడా సకాలంలో రాకున్నా విధులు నిర్వర్తిస్తున్నారు. జీపీలకు 2022 ఏప్రిల్ నుంచి ఆర్థిక సంఘం నిధులు రాష్ట్ర ప్రభుత్వం నుంచి సక్రమంగా విడుదల కావడం లేదు. అక్టోబర్ వరకు ఫండ్ విడుదల చేసినా జీపీలకు నిధులు రాకపోవడంతో కార్మికుల వేతనాలు నెలవారీ ఖర్చులు భారంగా మారాయి. గత్యంతరం లేక పన్నులు వసూలు చేసిన నగదు, జనరల్ ఫండ్ ఖాతాల్లో జమచేసి మొత్తం నుంచి వేతనాలు చెల్లిస్తున్నారు. చిన్న జీపీల్లో ఆదాయం లేని వాటికి సర్పంచ్‌లు అప్పులు తెచ్చి చెల్లిస్తున్నారు.

ట్రెజరీల్లోనే చెక్కులు..

జనరల్ ఫండ్ నుంచి వేతనాలు చెల్లించేందుకు చెక్కులు ట్రెజరీకి పంపిస్తున్నారు. అక్కడే నెలల తరబడి పాస్ కావడం లేదు. ఖాతాలు ఫ్రీజింగ్‌లో ఉండడం వల్ల చెక్కులు మూలుగుతున్నాయి. ఆర్థిక సంఘం నిధులు విడుదలైతే ట్రెజరీతో సంబంధం లేకుండా చెక్కుల ద్వారా వేతనాలు అందించవచ్చు.



తాటికొండలో పనులు చేస్తున్న జీపీ కార్మికులు



ఈ ఫొటోలోని వ్యక్తి పేరు గండి సురేందర్. లింగాలఘణపురం మండలం వడిచర్ల గ్రామానికి చెందిన ఈయన మల్టీపర్పస్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. భార్య ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. నివసించడానికి గ్రామంలో ఇల్లు ఉంది. ఎలాంటి ఆస్తిపాస్తులు లేవు. నెలవారీ జీతం మీద కుటుంబం గుస్తున్నది. 'మూడు నెలల నుంచి వేతనం రాకపోవడంతో కుటుంబ గడవడానికి రూ.20వేల వరకు అప్పు మిత్తికి తెచ్చుకున్నం'.. అంటూ సురేందర్ వాపోయాడు.

వేతన చెక్కులు ఆపడం లేదు..



మల్టీపర్పస్ వర్కర్ల వేతనాల చెల్లింపులో జాప్యం జరుగుతున్నది వాస్తవమే. ఆర్థిక సంఘం నిధులు జీపీ ఖాతాల్లో జమైతే ఎలాంటి ఇబ్బందులు ఉండవు. ఆ నిధుల నుంచే వేతనాలు చెల్లించాలి. ప్రస్తుతం జనరల్ ఫండ్ నుంచి వేతనాలు ఇస్తున్నట్లు తమ దృష్టికి వచ్చింది. చెక్కులను వెంటనే క్లియర్ చేయాలని చెబుతాం.

\- వసంత, ఇన్‌చార్జ్ డీపీఓ

కార్మికులకు ఇల్లు గడవడం లేదు



జీపీ కార్మికులతో గ్రామాల్లో అన్ని రకాల పనులు చేయించుకుంటున్న ప్రభుత్వం వేతనాలు ఇవ్వకపోవడం దారుణం. మూడు నెలల నుంచి వేతనాలు రాకపోవడంతో ఇల్లు గడవడం భారంగా మారింది. వెంటనే నిధులు విడుదల చేసి జీతాలు చెల్లించాలి. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తాం.

\- రాపర్తి రాజు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

దేశ సంపదను కొల్లగొడుతున్న బీజేపీ

- మాజీ మంత్రి సంబాని చంద్రశేఖర్‌గౌడ్

జనగామ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను కొల్లగొడుతూ అదానీ, కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తున్నదని మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ సంబాని చంద్రశేఖర్‌గౌడ్ అన్నారు. స్థానిక ఓ ఫంక్షన్ హాల్‌లో టీపీసీసీ మెంబర్ డాక్టర్ లకావత్ లక్ష్మీనారాయణ నాయక్ అధ్యక్షతన శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాహుల్‌గాంధీ ఎంపీ సభ్యత్వం రద్దు చేయడంతోపాటు ఆయన అధికారిక క్వార్టర్ ఖాళీ చేయించడం బీజేపీ కక్షసాధింపులో భాగమన్నారు. ప్రజల కోసం పని చేస్తున్న రాహుల్ వెంటే దేశ ప్రజలు ఉన్నారని, అధికార అహంకారంతో విర్రవీగిన పార్టీలు చరిత్రలో కనుమరుగు కాక తప్పదన్నారు. సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఎర్రమల్ల సుధాకర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, డాక్టర్ రాజమౌళి, మేడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్‌గౌడ్

నెల్లుట్ల, కామారెడ్డిగూడెం జీపీలకు రాష్ట్రస్థాయి అవార్డులు

లింగాలఘణపురం/దేవరుప్పుల: లింగాలఘణపురం మండలం నెల్లుట్ల, దేవరుప్పుల మండలం కామారెడ్డిగూడెం జీపీలకు రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డులు దక్కాయి. ఈ మేరకు హైదరాబాద్ రాజేంద్రనగర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ ఆడిటోరియంలో శుక్రవారం జరిగిన 'దీన్ దయాళ్ ఉపాధ్యాయ సతత్ వికాస్ జాతీయ పంచాయతీ పురస్కారాలు–2023' కార్యక్రమంలో మంత్రులు కేటీఆర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు చేతులమీదుగా గ్రామాల సర్పంచ్‌లు స్వరూపరాణి, అంజమ్మ, కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి అవార్డులు అందుకున్నారు. అవార్డుకు తొమ్మిది అంశాలను పరిశీలించగా.. నీటి సమృద్ధి, భగీరథ నీటి సరఫరా వ్యవస్థ సేవలపై అవార్డులు లభించాయి. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీఆర్‌డీఓ రామిరెడ్డి, జెడ్పీ సీఈఓ వసంత పాల్గొన్నారు.





సర్పంచ్‌లు స్వరూపరాణి, అంజమ్మకు అవార్డులు అందజేస్తున్న మంత్రులు కేటీఆర్, ఎర్రబెల్లి

వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి



ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

జనగామ రూరల్: పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వచ్చిన కార్యకర్తలు గెట్టులోకి చొచ్చుకెళ్లగా పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఎంఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు తీగల ప్రదీప్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ కోసం 28 ఏళ్లుగా పోరాటం చేస్తున్నామని, అధికారంలోకి వస్తే వంద రోజుల్లో పార్లమెంట్‌లో బిల్లు పెట్టి అమలు చేస్తామని చెప్పిన బీజేపీ సర్కారు మోసం చేసిందన్నారు. మాదిగల వర్గీకరణ చేయకపోతే పార్టీకి పుట్టగతులు ఉండవని చెప్పారు. కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి రాగళ్ల ఉపేందర్, జిల్లా ఇన్‌చార్జ్ ఇనుముల నర్సయ్య, జేరిపోతుల సుధాకర్, ఎడవెల్లి సోమశేఖర్, పరుశరాములు, గద్దల కిషోర్, గువ్వల రవి, శ్యామ్ సన్, కోడిదేడి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోటి ఓట్లు.. 90 సీట్లు

- ప్రగతి భవన్‌కు స్లాట్ బుకింగ్ చేయాల్సిందే..
- మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్

జనగామ: రాష్ట్రంలో త్వరలో జరిగే ఎన్నికల్లో కోటి ఓట్లు.. 90 సీట్లు లక్ష్యంగా బీజేపీ శ్రేణులు కష్టపడి పని చేయాలని మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ పిలుపునిచ్చారు. నెల్లుట్ల శివారులో నూతనంగా నిర్మించిన పార్టీ జిల్లా కార్యాలయాన్ని శుక్రవారం జాతీయ అధ్యక్షుడు నడ్డా ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నర్సయ్యగౌడ్‌తోపాటు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాబోతోందని, ప్రగతి భవన్‌కు ముందస్తు స్లాట్ బుకింగ్ చేసుకోవాల్సిందే అన్నారు. కేసీఆర్ పంచుతున్న క్యాష్‌ను చూసి భయపడవద్దని, ప్రజలు ఆ ఓట్లన్నీ మన ఖాతాల్లోనే వేస్తారని చెప్పారు. రాహుల్ పేరు చివరన గాంధీ అనే పదం పెట్టుకోవడానికి అనర్హుడన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే ప్రతి నియోజకవర్గంలో 5వేల డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి నగదు రూపేనా సాయం చేస్తుందని, అలాగే జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఏటా నోటిఫికేషన్లు, రిక్రూట్‌మెంట్లు చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి విజయరామారావు, అధికార ప్రతినిధి రాకేష్‌రెడ్డి, జనగామ ఇన్‌చార్జ్ పాపారావు, ముక్కెర తిరుపతిరెడ్డి, బేజాడి బీరప్ప, బొజ్జపల్లి సుభాష్, సౌడ రమేష్, ఉడుగుల రమేష్, పవన్‌శర్మ, గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, మహంకాళి హరిశ్చంద్రగుప్త తదితరులు ఉన్నారు.

ఫ్లెక్సీల రగడ..

పార్టీనూతన కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా ఆర్టీసీ చౌరస్తాలో స్వాగత ఫ్లెక్సీలు ఏర్పాటు చేయగా.. మున్సిపాలిటీ అనుమతి లేకుండా ఏర్పాటు చేశారంటూ పలువురు అధికారులు వాటిని తొలగించే ప్రయత్నం చేశారు. బీజేపీ శ్రేణులు అధికార పార్టీ ఫ్లెక్సీలకు ఏ అనుమతి ఉందో చూపించాలని పట్టుబట్టారు. ప్రజల నుంచి పార్టీకి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకే ఇలా చేస్తున్నారని నియోజకవర్గ కన్వీనర్ బల్ల శ్రీనివాస్ అనడంతో పురపాలిక అధికారులు వెళ్లిపోయారు.



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న బూర, శృతి

సైబర్ ఉచ్చులో మడ్తపల్లి వాసి

టేకుమట్ల(రేగొండ): జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని మడ్తపల్లికి చెందిన ఓ వ్యక్తి రూ.2.25లక్షలు పోగొట్టుకున్న ఘటన శుక్రవారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మడ్తపల్లికి చెందిన ఇంజపూరి నర్సయ్యకు గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి సెల్ నంబర్ నుంచి ఖాతా బ్లాక్ అయినట్లు మెసేజ్ రావడంతో కంగారుగా నర్సయ్య వెంటనే ఆ నంబర్‌కు కాల్ చేశాడు. వారు ఐఎఫ్ఎస్‌సీ కోడ్, ఏటీఎం వివరాలు చెప్తే ఖాతా అప్‌డేట్ చేస్తామని చెప్పి సెల్‌కి వచ్చిన ఓటీపీ అడగడంతో నర్సయ్య ఓటీపీ చెప్పాడు. దీంతో ఖాతాలోని రూ.2.25లక్షలు విత్‌డ్రా అయినట్లు మెసేజ్ వచ్చింది. దీంతో మోసపోయానని గుర్తించిన బాధితుడు రాత్రి సైబర్‌సెల్‌లో ఫిర్యాదు చేసి, శుక్రవారం ఉదయం రేగొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

ఐదుగురిపై కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సిగ్నల్ కాలనీలో బీఆర్ఎస్ అర్బన్ యూత్ ప్రధాన కార్యదర్శి బోగ రవిచంద్రపై హత్యాయత్నం కేసులో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఐదుగురిపై హత్యాయత్నం కేసు నమోదు చేశామని టౌన్ సీఐ సతీష్ శుక్రవారం తెలిపారు. బోగ రవిచంద్ర భార్య శ్రావణి, అత్త రమ, సట్ల యాకయ్య, ప్రశాంత్, సంతోష్‌పై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామన్నారు. కాగా, దాడిలో తీవ్రంగా గాయపడి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బోగ రవిచంద్రను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

స్థలం అప్పగింత

వరంగల్ క్రైం: ఏనుమాముల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆరెపల్లిలో కబ్జాకు గురైన స్థలాన్ని తిరిగి యజమాని అయిన కానిస్టేబుల్‌కు అప్పగించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఎం టీ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న పడిదల రవీందర్ 2019లో స్థలం కొనుగోలు చేశాడు. సదరు భూమి ఇటీవల కబ్జాకు గురికావడంతో సీపీ రంగనాథ్ ఆదేశాలతో రంగంలోకి దిగిన పోలీసులు కబ్జాదారులపై కేసు నమోదు చేసి, స్థలం హెడ్‌కానిస్టేబుల్‌కు అప్పగించారు. దీంతో శుక్రవారం హెడ్‌కానిస్టేబుల్ కుటుంబ సభ్యులు సీపీని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పైడిపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, షేక్ హుస్సేన్ తప్పుడు పత్రాలు సృష్టించి మొండ్రాయి గ్రామానికి చెందిన బొల్ల పెద్ద హైమకు రిజిస్ట్రేషన్ చేయించినట్లు పోలీసుల విచారణలో తేలినట్లు తెలిసింది. నకిలీ పత్రాలు అని తేలడంతో హైమ తన రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసుకొని పత్రాలను హెడ్ కానిస్టేబుల్‌కు అందజేసింది.

కేఎంసీకి మరో ఖ్యాతి

- మొదటిసారిగా పీజీ సూపర్‌స్పెషాలిటీ సీట్ల మంజూరు
- అభినందనలు తెలిపిన మంత్రి హరీశ్‌రావు

ఎంజీఎం : 1959లో 50 ఎంబీబీఎస్ సీట్లతో స్థాపించబడ్డ కాకతీయ మెడికల్ కళాశాల దినదినాభివృద్ధి చెందుతూ 250 మెడికల్ సీట్లను సాధించుకుని మెరుగైన వైద్యవిద్యను అందిస్తూ కొనసాగుతుంది. ఈ క్రమంలో ప్రస్తుతం మరో మైలురాయిని అధిగమించింది. 1972లో పీజీ సీట్లను సాధించుకున్న కేఎంసీ ప్రస్తుతం 183 సీట్లతో కొనసాగుతున్న క్రమంలో మొట్టమొదటిసారిగా ప్రభుత్వరంగ కళాశాలలో సూపర్‌స్పెషాలిటీ సీట్లను సాధించి మరోసారి తన ఖ్యాతిని చాటుకుంది. పది రోజుల క్రితం నేషనల్ మెడికల్ కౌన్సిల్ సభ్యులు పీజీ సీట్ల అనుమతి కోసం ఎంజీఎం ఆస్పత్రితోపాటు కాకతీయ మెడికల్ కళాశాలను సందర్శించి సదుపాయాలను పరిశీలించారు. ఈ క్రమంలో ఎంజీఎం ఆస్పత్రిలోని ఎమర్జెన్సీ విభాగం(ఎంజీఎం క్యాజువాలిటీ)ను సందర్శించి సంతృప్తి చెందిన బృందం సభ్యులు ఎన్ఎంసీకి అందించిన నివేదిక మేరకు ఐదు ఎమర్జెన్సీ సీట్లు మంజూరు చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. సూపర్‌స్పెషాలిటీ నెఫ్రాలజీ విభాగంలో మరోఐదు సీట్లను అనుమతినివ్వడంలో వైద్యవర్గాల్లో హర్షం వ్యక్తం అవుతుంది.

1972లో పీజీ సీట్ల మంజూరు..

కాకతీయ మెడికల్ కళాశాలకు 1972 సంవత్సరంలో మొట్టమొదటి సారిగా పీజీ సీట్లు మంజూరయ్యాయి. ప్రస్తుతం 183 సీట్లతో కొనసాగుతోంది. 2006లో ఎంజీఎం ఆస్పత్రిని అప్పటి ప్రభుత్వం సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసినప్పటికీ పూర్తిస్థాయిలో సదుపాయాలు లేకపోవడంతో నేటి వరకు కేఎంసీ సూపర్‌స్పెషాలిటీ సీట్లను సాధించలేకపోయింది. ప్రస్తుతం ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగంతో పాటు నెఫ్రాలజీ విభాగంలో సీట్ల మంజూరుతో పేద ప్రజలకు మరిన్ని సేవలు అందనున్నాయని వైద్యాధికారులు తెలిపారు.



మెరుగుపడనున్న అత్యవసర విభాగాలు

ఎంజీఎం ఆస్పత్రికి మంజూరైన ఐదు ఎమర్జెన్సీ మెడిసిన్ పీజీ సీట్లతో ఎంజీఎం ఆస్పత్రిలో అత్యవసర విభాగాల సేవలు మరింత మెరుగుపడనున్నాయి. ఎంజీఎం ఆస్పత్రి నిత్యం పదుల సంఖ్యలోవచ్చే రోగులను పీజీ వైద్యులు పరిశీలించి ఆ రోగిని ఏ విభాగం వైద్యులకు తరలించాలో తక్షణమే నిర్ణయం తీసుకునే అవకాశం ఉండడంతో అత్యవసరం వైద్యం త్వరగా అందే పరిస్థితులను నెలకొనున్నాయి. ఈ సీట్ల మంజూరుపై ఎంజీఎం ఆర్ఎంఓలు మురళి, దిలీప్ హర్షం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా.. కేఎంసీకి మొట్టమొదటిసారిగా సూపర్‌స్పెషాలిటీ సీట్లను సాధించడంపై మంత్రి హరీశ్‌రావు ట్విట్టర్ ద్వారా వైదారోగ్యశాఖాధికారులను అభినందించారు.

సేవలు మెరుగుపడుతాయి..



కేఎంసీకి మొట్టమొదటిసారిగా సూపర్‌స్పెషాలిటీ సీట్లు రావడం సంతోషంగా ఉంది. కేఎంసీకి మంజూరైన ఎమర్జెన్సీ మెడిసిన్ సీట్లతోపాటు నెఫ్రాలజీ విభాగం పీజీ సీట్లతో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు మరిన్ని మెరుగైన సేవలు అందనున్నాయి.

– డాక్టర్ మోహన్‌దాస్, కేఎంసీ ప్రిన్సిపాల్

కలెక్టరేట్ ముట్టడి

- ర్యాలీగా చేరుకున్న ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు, కార్యకర్తలు
- కలెక్టరేట్ లోపలికి వెళ్లేందుకు యత్నం
- అడ్డుకున్న పోలీసులు

హన్మకొండ/ వరంగల్ రూరల్: పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి, వర్గీకరణకు చట్టబద్ధత కల్పించకుండా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం హనుమకొండ, వరంగల్ కలెక్టరేట్లను ముట్టడించారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియం నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు అప్పటికే కలెక్టరేట్ గేట్లు మూసివేసి భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ర్యాలీగా వచ్చిన ఎమ్మార్పీఎస్, మహాజన సోషలిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తలు కలెక్టరేట్ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో పోలీసులు, ఆందోళనకారుల మధ్య తోపులాట జరిగింది. దీంతో కలెక్టరేట్ ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. ధర్నాను విరమించుకోవాలని పోలీసులు కోరినా మొదట్లో వినిపించుకోలేదు. ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకుల బృందాన్ని తీసుకెళ్లి జిల్లా రెవెన్యూ అధికారి వాసుచంద్ర, వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ శ్రీవత్సకోటకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహాజన సోషలిస్టు పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంద కుమార్ మాదిగ మాట్లాడారు. మోదీ ప్రభుత్వం మాదిగల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. బీజేపీ అధికారంలోకి రాగానే 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పి 9 సంవత్సరాలు అవుతున్న కార్యరూపం ఇవ్వకుండా మోసం చేస్తుందని ధ్వజమెత్తారు. వచ్చే సాధారణ ఎన్నికల లోపు ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని, దీనిపై స్పష్టమైన వైఖరి వెల్లడించాలని డిమాండ్ చేశారు. లేని ఎడల ఏప్రిల్ 3న బీజేపీ రాష్ట్ర, జిల్లా కార్యాలయాల ముట్టడిని చేపడుతామని, 4న రెండు తెలుగు రాష్ట్రాల రాజధానుల జాతీయ రహదారులు ముట్టడిస్తామన్నారు. ఎమ్మెస్పీ జిల్లా కన్వీనర్ గంగారం శ్రీనివాస్, జన్ను దినేష్, సుకుమార్, మంద రాజు, ఏకు శంకర్ , ముఖేష్, నారాయణ మాదిగ, భిక్షపతి మాదిగ, సదయ్య మాదిగ, వెంకటస్వామి మాదిగ, శనిగరపు రవీందర్ మాదిగ, మధుకర్, సూర్యం, శాంతిసాగర్, మహేష్, సాంబరాజు, భాగ్య, స్వరూప, విమల ఎమ్మెస్పీ వరంగల్ జిల్లా కో–ఆర్డినేటర్ బిర్రు మహేందర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ వరంగల్ జిల్లా కన్వీనర్ కట్ల రాజశేఖర్ మాదిగ, ఎమ్మెస్పీ నర్సంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రణయ్‌దీప్, విజయ్‌మాదిగ, ఈర్ల కుమార్ తదితరులు పాల్గొన్నారు.



హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు

చిన్నారులను మింగిన 'మిషన్' గుంత

- చెరువులో పడి ఇద్దరు బాలురు మృతి
- బహిర్భూమికి వెళ్లగా.. ప్రమాదవశాత్తు ఘటన
- చాకలి ఐలమ్మనగర్‌లో విషాదఛాయలు



కిరణ్‌సింగ్



దీపక్‌సింగ్



రోధిస్తున్న కుటుంబ సభ్యులు

వరంగల్: ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు బాలురు చెరువులో పడి మృతి చెందిన ఘటన గ్రేటర్ వరంగల్ నగరంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఏనుమాముల పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎ.మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. 14వ డివిజన్ ఏనుమాముల సమీపాన ఉన్న చాకలి ఐలమ్మనగర్‌లో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న లక్ష్మీబాయి, లఖన్‌సింగ్ దంపతులకు ముగ్గురు కుమారులు, ఒక కూతురు సంతానం. లఖన్‌సింగ్ వ్యవసాయ మార్కెట్‌లో హమాలీగా.. లక్ష్మీబాయి కూలీగా జీవనం కొనసాగిస్తున్నారు. రోజు మాదిరిగానే వీరి పిల్లలు కిరణ్‌సింగ్(12), దీపక్‌సింగ్(9) బహిర్భూమికి చెరువు వద్దకు వెళ్లారు. దీపక్‌సింగ్ చెరువులో దిగి జారి గుంతలో పడడాన్ని చూసిన అన్న కిరణ్‌సింగ్ కాపాడేందుకు వెళ్లి అందులోనే పడిపోయారు. గమనించిన స్థానికులు డయల్ 100కు కాల్ చేయడంతో ఏనుమాముల పోలీసులు చేరుకుని గుంతలో పడిన ఇద్దరు బాలురను బయటకు తీసి సీపీఆర్ చేయడంతో నోటి నుంచి నీళ్లు బయటకు వచ్చాయి. వెంటనే వారిని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు చెప్పారని సీఐ తెలిపారు. మిషన్ కాకతీయ పనుల సందర్భంగా తీసిన గుంత లోతుగా ఉండడంతో పిల్లలు అందులోపడి మృతి చెందినట్లు చెప్పారు. సంఘటన స్థలాన్ని ఈస్ట్‌జోన్ డీసీపీ కరుణాకర్ సందర్శించారు. పిల్లల తండ్రి లఖన్‌సింగ్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మహేందర్ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు.

విద్యార్థులేమైనా తీవ్రవాదులా..?

- మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్
- కేయూ జేఏసీ నేతల అరెస్ట్, విడుదల
- విద్యార్థి సంఘాల నాయకులకు పరామర్శ

హసన్‌పర్తి: కాకతీయ యూనివర్సిటీ జేఏసీ నేతల ఇళ్లలపై పోలీసు బలగాలు అర్ధరాత్రి దాడి చేసి అరెస్ట్ చేయడాన్ని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ ఖండించారు. విద్యార్థులు ఏమైనా తీవ్రవాదులా అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అప్రజాస్వామ్యానికి పాల్పడుతోందని మండిపడ్డారు. రెండు రోజుల క్రితం కేయూలో జరిగిన ఆందోళన కారణంగా వివిధ విద్యార్థి సంఘాలకు చెందిన 13 మందిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో ఉన్న విద్యార్థి జేఏసీ నేతలను మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేందర్, కాంగ్రెస్ వర్ధన్నపేట నియోజకవర్గ కో–ఆర్డినేటర్ నమిండ్ల శ్రీనివాస్ శుక్రవారం పరామర్శించారు. అనంతరం పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ అర్ధరాత్రి యూనివర్సిటీ విద్యార్థిసంఘాల నేతలను అరెస్ట్ చేయడం సిగ్గుచేటన్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ దోషులకు శిక్ష పడే వరకు పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడిన టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తే విద్యార్థులపై కేసు నమోదు చేస్తారా అని మండిపడ్డారు. ఈవ్యవహారంపై గవర్నర్‌ను కలుస్తామన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల సభకు అనుమతి ఇస్తామని నమ్మించి చివరికి వీసీ అనుమతి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. యూనివర్సిటీలో విధులు నిర్వహిస్తున్న ఆంధ్రకు చెందిన రిజిస్ట్రార్‌పై ఫిర్యాదు చేస్తే తెలంగాణ విద్యార్థులపై కేసులు నమోదు చేస్తారా..? అని ప్రశ్నించారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ పోలీస్‌స్టేషన్‌లో కేయూ నేతలను పరామర్శించి, సెంట్రల్ జోన్ డీసీపీతో మాట్లాడారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దేశిని సదానందం, జిల్లా అధికార ప్రతినిధి పుప్పాల రజనీకాంత్ ఉన్నారు.



జేఏసీ నేతలను పరామర్శిస్తున్న మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్

ఇళ్లు ఖాళీ చేయమంటున్నారు..

పోలీసులు అర్ధరాత్రి ఇళ్లలపై దాడులు చేసి అరెస్ట్ చేయడంతో ఇంటి యజమానులు ఖాళీ చేయమంటున్నారని జాక్ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి పోలీస్ బలగాలు ఇళ్లలను చుట్టుముట్టడం వల్ల పేరెంట్స్ భయాందోళనకు గురయ్యారని చెప్పారు. తమపై నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

జేఏసీ నేతల అరెస్ట్, విడుదల

రెండు రోజుల క్రితం కేయూలో జరిగిన ఘటనపై రిజిస్ట్రార్ ఫిర్యాదుతో 13 మందిపై కాకతీయ యూనివర్సిటీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈమేరకు జేఏసీ నేతలు ఇట్టబోయిన తిరుపతి యాదవ్, మేడ రంజిత్‌కుమార్, కాడపాక రంజిత్, గుగులోత్ రాజు, మొగిలి వెంకట్‌రెడ్డి, బొట్ల మనోహర్, బండిగ రాకేష్, అరెగంటి నాగరాజు, కామగాని శ్రవణ్‌కుమార్, రంజిత్, మహేష్‌లను అరెస్ట్ చేసి.. వ్యక్తిగత పూచీకత్తులపై విడుదల చేశారు.

కేయూలో మోహరించిన పోలీసులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని వివేకానంద, పోతన హాస్టళ్లలో ఉంటున్న పలు విద్యార్థిసంఘాల బాధ్యులను, అలాగే ఇళ్లలో ఉండేవారిని మొత్తం 11మందిని గురువారం అర్ధరాత్రి తర్వాత యూనివర్సిటీ పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీంతో విద్యార్థులు మళ్లీ ఆందోళనలు చేస్తారనే అనుమానంతో యూనివర్సిటీలో పోలీసులు మోహరించారు. ప్రధానంగా పరిపాలనా భవనం, గెస్ట్‌హౌజ్ ప్రాంతంలో పోలీసులు బందోబస్తును నిర్వహించారు. కాగా, అరెస్టయిన జేఏసీ చైర్మన్ ఇట్టబోయిన తిరుపతియాదవ్, టీజీవీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడ రంజిత్‌కుమార్ ఇతర బాధ్యులు మాట్లాడుతూ.. యూనివర్సిటీలో నిరుద్యోగల భరోసాకు ధర్నా చేసిన నాయకులపై యూనివర్సిటీ అధికారులు కేసులు పెట్టడం శోచనీయమన్నారు. 30 లక్షలమంది నిరుద్యోగులతో చెలగాటమాడిన టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యులను అరెస్టుచేయని ప్రభుత్వం వారి పక్షాన కొట్లాడేవారిపై కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.



కేయూ పరిపాలనా భవనం వద్ద పోలీసుల బందోబస్తు

మావోయిస్టు దళసభ్యుడి లొంగుబాటు

ములుగు: సీపీఐ మావోయిస్టు దళసభ్యుడు మీడియం జోగయ్య అలియాస్ జంగు అలియాస్ జోగ శుక్రవారం ములుగు ఓఎస్డీ అశోక్ కుమార్ ఎదుట లొంగిపోయాడు. ఓ ఓఎస్డీ తెలిపిన వివరాల ప్రకారం.. పూజారి కాంకేర్ ఆర్పీసీ, మిలీషియా కమాండర్ సోడి నర్సింగరావు అండతో మావోయిస్టు భావజాలానికి ఆకర్షితుడై 2016లో దళంలో చేరాడు. 2017లో పార్టీ సభ్యుడిగా పదోన్నతితోపాటు చర్ల స్పెషల్ గెరిల్లా స్క్వాడ్‌కి బదిలీ అయ్యాడు. 2020 అక్టోబర్ వరకు దళసభ్యుడిగా చేసి అదే సంవత్సరంలో ఏరియా కమిటీ మెంబర్‌గా దామోదర్ ప్రొటెక్షన్ టీంకు బదిలీ అయ్యాడు. ప్రస్తుతం ఇతనిపై రూ.4లక్షల రివార్డు ఉన్నట్లుగా ఓఎస్డీ తెలిపారు. ఛత్తీస్‌గఢ్, వెంకటాపురం(కె) ఏరియాలో హత్యలు చేయడం, ఎన్‌కౌంటర్, బాంబులు అమర్చడం వంటి ఆరు కేసులు ఉన్నాయి. ప్రస్తుతం మావోయిస్టులపై తీవ్ర విరక్తి, వ్యతిరేకత, ప్రజలపై చేస్తున్న దాడులను చూసి సహించలేక లొంగినట్లుగా జోగయ్య చెప్పినట్లు ఓఎస్డీ తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తక్షణ సాయాన్ని అందించారు.



జోగయ్యకు తక్షణ సాయం అందజేస్తున్న ఓఎస్డీ

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



మల్లయ్య (ఫైల్)

ఖానాపురం: మండల కేంద్రానికి చెందిన అడ్డిచర్ల మల్లయ్య (71) ఇంట్లో విద్యుత్ షాక్‌తో శుక్రవారం మృతి చెందాడు. ఎస్సై తిరుపతి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లయ్య శుక్రవారం ఉదయం మోటార్‌ను రిపేరు చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగలడంతో కిందపడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా, మృతుడి కుమారుడు రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. మల్లయ్యకు భార్య, పిల్లలు ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో బలవన్మరణం



కొండయ్య (ఫైల్)

నల్లబెల్లి: కుటుంబ కలహాలకు ఆర్థిక ఇబ్బందులు తోడు కావడంతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని రేలకుంటలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై సురేష్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రేలకుంటకు చెందిన అజ్మీరా జనాబాయి, కొండయ్య(48) దంపతులకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. కొంత కాలంగా తరచుగా కుటుంబంలో గొడవలు జరుగుతుండడంతో కొండయ్య మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మార్చి 28న ఆర్థిక ఇబ్బందుల విషయంలో భార్యభర్తలు గొడవపడ్డారు. దీంతో మనస్తాపానికి గురైన కొండయ్య గురువారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కొండయ్య భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కొత్తపేటలో యువకుడు..



సుమన్(ఫైల్)

వరంగల్: గ్రేటర్ వరంగల్ నగరంలోని 3వ డివిజన్ పరిధిలోని కొత్తపేట గ్రామానికి చెందిన అంకేశ్వరపు సుమన్(26) ఆర్థిక ఇబ్బందులు భరించలేక శుక్రవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. కొత్తపేటకు చెందిన అంకేశ్వరపు పైడి, కేతలకు మూడో సంతానం సుమన్. తండ్రి పదేళ్ల క్రితం, అక్క దీర్ఘకాలికవ్యాధితో మృతి చెందారు. అన్నలు ఇద్దరు తమ కుటుంబాలతో వరంగల్‌లో జీవనం సాగిస్తుండడంతో తల్లి పోషణభారం సుమన్‌పై పడింది. కూలీ పనిచేస్తున్న సుమన్ తల్లి దీర్ఘకాలిక వ్యాధికి గురికావడంతో చికిత్స నిమిత్తం అప్పులు చేసినట్లు సమాచారం. అప్పుల బాధ తాళలేక జీవితం మీద విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని స్థానికులు తెలిపారు. ఈ విషయం తెలిసిన వెంటనే ఏనుమాముల ఇన్‌స్పెక్టర్ మహేందర్, ఎస్సై రాజన్‌బాబు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

ప్రయాణికులపై టోల్ పిడుగు..!

- డబుల్ టచ్‌కు రూ.10 అదనం
- నేటి నుంచి కొత్తరేట్లు

జనగామ: రాష్ట్ర వ్యాప్తంగా టోల్ ప్లాజాల వద్ద నేటి (శనివారం) నుంచి కొత్త రేట్లు అమలులోకి రానున్నాయి. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కోమళ్ల, దేవరుప్పుల మండలం సింగరాజుపల్లి వద్ద టోల్‌ప్లాజాలు ఉన్నాయి. ప్రతిరోజు రెండు టోల్ ప్లాజాలను దాటుకుని సుమారు 18 వేల వాహనాలు ప్రయాణిస్తాయి. టోల్ ఫీజు 5శాతం వరకు పెంచడంతో కారు, బస్సు, ట్రావెల్స్, ట్రాన్స్‌పోర్టు వెహికిల్స్ వాహనాలపై అదనపు భారం తప్పడం లేదు. ఇదే క్రమంలో ఆర్టీసీ బస్సులపై పెద్దగా భారం లేకున్నప్పటికీ ఒకే రూట్‌లో రెండు టోల్ ప్లాజాలు ఉంటే మాత్రం ఎక్స్‌ప్రెస్, డీలక్స్ ప్రయాణికులకు అదనంగా రూ.10 వడ్డన వేస్తారు. హనుమకొండ నుంచి హైదరాబాద్ ఎంజీబీఎస్‌కు ఎక్స్‌ప్రెస్‌కు రూ. 175, డీలక్స్ బస్సు సర్వీసుకు రూ.205 టికెట్ ధర ఉండగా డైరెక్టుగా వెళ్లే ప్రయాణికులకు టికెట్‌పై రూ.10 చొప్పున అదనంగా తీసుకుంటారు. జనగామ నుంచి సిద్దిపేట, సూర్యాపేట, హనుమకొండ, ఉప్పల్ వెళ్లే ప్రయాణికులకు మాత్రం గతంలో ఉన్న ఫీజులే వర్తించనున్నాయి. ప్రస్తుతం పల్లె వెలుగు బస్సు సర్వీసులకు టోల్ ఫీజు రూ.6, ఎక్స్‌ప్రెస్‌కు రూ.6, డీలక్స్‌కు రూ.9 చొప్పున టికెట్‌పై అదనంగా తీసుకుంటున్నారు. నేటి నుంచి కోమళ్ల టోల్ ప్లాజా వద్ద కారు, జీపు, వ్యాన్‌కు సింగిల్ జర్నీకి రూ.120, రిటర్న్ జర్నీ కోసం అయితే రూ.175, సింగరాజుపల్లి టోల్ ప్లాజా వద్ద కార్, వ్యాన్, జీప్, లైట్ మోటారు వెహికిల్స్‌కు సింగిల్ రూ.35, డబుల్‌కు రూ.55 వరకు పెంచి తీసుకోనున్నారు.



జనగామ జిల్లాలోని సింగరాజుపల్లి టోల్ ప్లాజా

తొమ్మిది నెలల తర్వాత నిందితుల అరెస్ట్

- వివరాలు వెల్లడించిన పోలీసులు

రఘునాథపల్లి: రోడ్డు ప్రమాదానికి కారకులై, ఒకరి మృతికి కారణమైన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జనగామ రూరల్ సీఐ ఆర్ సంతోష్ తెలిపారు. తొమ్మిది నెలలకు టాస్క్‌ఫోర్స్ సాయంతో నిందితులు చిక్కారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై వీరేందర్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ వివరాలు వెల్లడించారు. జనగామ జిల్లా రఘునాథపల్లి మండల కేంద్రానికి చెందిన దొడ్డ సునీల్‌రెడ్డి 2022 జూలై 7న జనగామ కోర్టులో పని నిమిత్తం తన ద్విచక్రవాహనంపై వెళ్లివస్తున్న క్రమంలో నిడిగొండ జెర్సీ పాలకేంద్రం వద్ద హైదరాబాద్ నుంచి హనుమకొండ వైపు వెళ్తున్న కారు సునీల్‌రెడ్డి ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టి వెళ్లింది. ఘటనలో ద్విచక్ర వాహనం నడుపుతున్న సునీల్‌రెడ్డికి తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. అప్పటి నుంచి గుర్తు తెలియని వాహనంతోపాటు ప్రమాదానికి కారణమైన నిందితులను పట్టుకునేందుకు తొమ్మిది నెలలుగా పోలీసులు యత్నిస్తున్నారు. గురువారం టాస్క్‌ఫోర్స్ సహకారంతో రోడ్డు ప్రమాదానికి కారణమైన కారును గుర్తించడంతో పాటు కారు డ్రైవర్ అజీజ్‌ఖాన్‌ను, ప్రమాద విషయం తెలిసినా పోలీసులకు సమాచారం ఇవ్వకుండా గోప్యంగా ఉంచిన అబ్బాస్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ, ఎస్సై తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్సై